## క్లుప్తంగా

### ఉచిత మెగా వైద్య శిబిరం



**యడ్లపాడు:** మండలంలోని సొలస గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని సొలస గ్రామంలోని రంగనాయక స్వామి ఆలయం వద్ద మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు పాల్గొని 200 మందికి రోగులకు ఈసీజీ బీపీ షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

### బలిజేపల్లిలో పోలీసుల తనిఖీలు



**రాజుపాలెం:** ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడే కొద్దీ పోలీసులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలలో జోరుగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామమైన బలిజేపల్లిలో పోలీసు అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ప్రతిగృహాన్ని జల్లెడ పట్టారు. గేదెల కొట్టాలు, గడ్డి వాములలోను విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు గానీ, మందు సామాగ్రి గానీ దొరకలేదు. ఎస్ఐ షమీర్ బాషా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇతర గ్రామస్తులు గ్రామంలో అనుమానంగా సంచరిస్తే పోలీసు వారికి తెలియజేయాలని చెప్పారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి యోగా న్యాయ నిర్ణేతగా అచ్చంపేట పీడీ



**అచ్చంపేట:** రాష్ట్ర స్థాయిలో జరిగే యోగాసనాల న్యాయ నిర్ణేతగా పాల్గొనేందుకు తాను అర్హత సాధించినట్లు స్థానిక జెడ్పీ హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్(పీడీ) ఆలపాటి సుజాత మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో అనంతపురంలో మినిస్టరీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసనాల న్యాయ నిర్ణేతల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన న్యాయ నిర్ణేతల అర్హత పరీక్షలో తాను ఎంపికయ్యానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### ఉపాధి పనులకు పేర్లు నమోదు

**నకరికల్లు:** ఉపాధి హామీ పనులను ఎన్నికల నియమావళి పూర్తయిన అనంతరం పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని ఏపీవో సుందర రావు మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఉపాధి పనులు అన్ని గ్రామాల్లోను చేపట్టలేకపోతున్నామని అన్నారు. ఉపాధి పనుల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఆయా గ్రామాల్లోని మేట్‌లను కలసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రూప్‌ల వారీగా పేర్లు నమోదు చేసుకొని సిద్ధంగా ఉంటే త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. జాబ్‌కార్డులు లేనివారు తమ పేర్లు నమోదు చేసుకొని జాబ్ కార్డులు పొందవచ్చని సూచించారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**సత్తెనపల్లి:** పట్టణంలోని 31వ వార్డుకు చెందిన కౌలు రైతు వాసుపల్లి లింగారెడ్డి (62) సోమవారం పాము కాటుకు గురై మృతి చెందాడు. గేదెలకు అవసరమైన గడ్డిని వామిలో నుంచి తీస్తుండగా పాము కాటు వేసింది. హుటాహుటిన ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబం కావడంతో మట్టి ఖర్చులకు కూడా డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండెం బాబురావు మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.7,500 నగదు అందించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో 31వ వార్డు ప్రెసిడెంట్ చెవూరి మధు, నాయకులు డాక్టర్ నిజాంపట్నం అమరేంద్ర, మార్క్, పల్లపు రోశయ్య, షేక్ జాని, కొణతం చంటిలు ఉన్నారు.

# ఖరీఫ్‌కు రైతన్న సమాయత్తం

- దుక్కులు దున్ని సాగుకు సిద్ధమైన కర్షకులు
- ఆశలు రేకెత్తిస్తున్న చెదురుముదురు వర్షాలు
- అందుబాటులోకి వచ్చిన ఆర్బీకేలు



సాగు సిద్ధం చేసిన పొలాలు



దుక్కులు దున్నతున్న రైతు



పశువుల పేడను పొలాలకు తోలుతున్న రైతులు

**వినుకొండ(నూజెండ్ల):** గతంలో వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తూ రైతులు అష్ట కష్టాలు పడేవారు ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. నూతన ప్రభుత్వం ఏర్పడక ముందే సకాలంలో రుతు పవనాలు రావటంతో రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. నియోజకవర్గం వాప్తంగా వేల ఎకరాలు విస్తీర్ణం ఉండగా సాగు చేసేందుకు రైతులు దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**ఖరీఫ్‌పై నమ్మకంతో రైతులు**

రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ శాఖ తెలపటంతో రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు దుక్కి దున్ని సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. గతంలో వర్షాలు సక్రమంగా లేకపోవటం సాగర్ జలాలు కూడా అందకపోవటంతో సుబాబుల్ జామాయిల్ తోటలు సాగు చేసిన రైతులు సుబాబుల్ జామాయిల్ చెట్లను తొలగించి వాటి స్థానంలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అందుబాటులోకి ప్రభుత్వం తీసుకు రావటంతో రైతులకు ఇబ్బందులు తొలగిపోయాయని అంటున్నారు.

**వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆనందం**

గత వారంలో రోజుల నుంచి చెదురు ముదురుగా వర్షాలు పడతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు పడతాయని అంచనాతో పూర్తిస్థాయిలో సాగుకు సిద్ధమయ్యారు. మండలంలోని బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ రూరల్ మండలాల్లో రైతులు పంటల సాగు కోసం ఎదురు చూస్తున్నారు.

### సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు

**శావల్యాపురం:** ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగా వస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటన చేయడంతో పాటు తొలకరి జల్లులు పడటంతో అన్నదాతలు ఖరీఫ్ సీజను సాగుకు సమాయత్తం అవుతున్నారు. దీంతో రైతులు పశువుల పేడను పొలాల్లో తోలుకునే పనుల్లో నిమగ్నం అవుతున్నారు. పంటకు ప్రయోజనంతో పాటు పెట్టుబడులు తగ్గి దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులు సేంద్రియ ఎరువుల వైపు ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగం దఫాలు వారీగా వినియోగిస్తే భూమిలో పోషకాలు శాతం పెరిగి భూసారం కూడా మరింత అభివృద్ధి చెంది పంట దిగుబడికి దోహదపడుతుంది. ఒక్కో ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు పశువుల పేడను ఎరువుగా ఉపయోగిస్తున్నారు. దీనిలోని సహజ సిద్ధ లవణాలు పంటకు లాభపడతాయి. భూమిలో ఉన్న అమ్లాలు / క్షారాల స్థాయిని నిలబెడతాయి. నేలలోని సూక్ష్మ జీవుల వృద్ధికి తోడ్పడుతుంది. అన్నీ రకాల పోషకాలు తయారవుతాయి. రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై సేంద్రియ ఎరువులు తయారీ కోసం ప్రభుత్వం జనుము పిల్లి పెసర, జీలగలు, తదితర విత్తనాలను రోజుల వ్యవధిలో రైతులకు మంజూరు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ అన్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వినియోగించటం వలన భూమిలో ఉన్న పోషకాలు శాతం తగ్గిపోతుందని ఆయన వివరించారు.

### అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది మొదటి నుంచే రైతు భరోసా కేంద్రాలు రైతులకు సేవ చేసేందుకు అందుబాటులోకి వచ్చాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంటాయి. ఎలాంటి కల్తీలకు తావులేకుండా ప్రభుత్వం గుర్తించిన కంపెనీల మందులు, ఎరువులు, విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు రైతు భరోసా కేంద్రాలల్లో కొనుగోలు చేసి నకిలీల బెడద నుంచి రక్షణ పొందవచ్చు.

–కె.అంజిరెడ్డి, ఏవో

### ఈ మృతుడెవరో.. గుర్తు తెలియదు!



**నరసరావుపేట రూరల్:** కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఐగ్రో స్కూల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి అచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### కౌంటింగ్ ఏర్పాట్లపై ఎన్నికల అధికారి సమీక్ష



**వినుకొండ(నూజెండ్ల):** స్వార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వరదా సుబ్బారావు, ఐదు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ 99 నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4 వతేదీన నర్సరావుపేటలో జరగునున్న నేపథ్యంలో, అనుసరించాల్సిన విధానం, శాంతిభద్రతలు, వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలు దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సమస్యాత్మక గ్రామలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.అలాగే కౌంటింగ్ ముగిసిన తరువాత కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాల రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అల్లరి మూకలను అణచివేస్తాం

- అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు హెచ్చరిక
- మాక్‌డ్రిల్ చేసి చూపించిన పోలీసులు



గొడవలకు దిగిన వారిపై లాఠీచార్జి ప్రయోగం చూపిస్తున్న పోలీసులు



అల్లరి మూకలపై ప్లాస్టిక్ పెల్లెట్లు ప్రయోగిస్తున్న పోలీసులు

**నరసరావుపేట:** ప్రజలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అరాచక శక్తులను సమర్థవంతంగా అణచివేస్తామని ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మలిక గార్గ్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో ఆర్ముడు రిజర్వు పోలీస్ సిబ్బందితో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా అరాచక శక్తులను ఏవిధంగా ఎదుర్కోవాలో డ్రిల్ ద్వారా చూపించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయాల్లో జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు తొలుత వార్నింగ్ ఇవ్వటం, అది వినకపోతే మేజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించటం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జి, ఆ తర్వాత అగ్నిమాపక విభాగం వారితో వాటర్ కెనాన్ ప్రయోగించటం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయటం, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయటం వంటివి డెమో ద్వారా ప్రదర్శించి చూపించారు.

ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కువ సంఖ్యలో కేంద్ర సాయుధ బలగాలు, ప్రత్యేకంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం జరిగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని, అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణ టుటౌన్ సీఐ భాస్కర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రామిరెడ్డిపాలెంలో కార్డిన్ సెర్చ్



**రొంపిచర్ల:** మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం రొంపిచర్ల ఎస్ఐ కె.పి. రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్డిన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని గృహాల్లో, చొప్పదొడ్లలో అణువు అణువు పరిశీలించారు. మారణాయుధాలు ఉన్నాయనే కోణంలో కూడా ప్రతి గృహంలో సోదాలు చేశారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితుల దృష్ట్యా కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామంలో ఉన్న మోటార్ సైకిళ్లను కూడా తనిఖీ చేసి పత్రాలతో సరి చూశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.పి. రవీంద్రతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



### రొంపిచర్లలో మోస్తరు వర్షం

**రొంపిచర్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కాగా మంగళవారం ఉదయానికి మండల కేంద్రమైన రొంపిచర్లలో 25.0 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అడపాదడపా వర్షాలతో ఆకాశం మబ్బులు కమ్మిఉండటంతో ఎండతీవ్రత నుంచి మండల ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే తొలకరిలోనే పొలాలు దుక్కులు దున్నుకొని అదునులో మెట్టపైర్లు విత్తుకునేందుకు వీలవుతుందని రైతులు తెలుపుతున్నారు.

# దాడి ఘటనలో ఇరువురిపై కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుధాకర్



కారుమంచి ఇంటిలో సోదాలు చేస్తున్న పోలీసులు

**శావల్యాపురం:** మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన కృష్ణాపురం గ్రామంలో మైనరు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంగళవారం వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ విలేకర్లతో మాట్లాడుతూ అదే గ్రామంలో ప్రధాన కూడలి వద్ద మద్యం మత్తులో ఉన్న మండవ రామకృష్ణ ఇష్టానుసారంగా అసభ్య పదజాలంతో షేక్ నాసరమ్మ కుటుంబ సభ్యులను దూషించాడు. దీంతో ఇరువురి మధ్య వాదులాటతో పాటు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో మైనరు బాలిక పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్‌తో రామకృష్ణ తలపై కొట్టటంతో పాటు కుటుంబ సభ్యులు కూడా దాడికి పాల్పడ్డారు.

ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, కేవలం ఇరువురి మధ్య జరిగిన సంఘటన మాత్రమేనని సీఐ వెల్లడించారు. ఇలాంటి విషయాలను రాజకీయాలు చేయడం ద్వారా గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగుతాయన్నారు. ప్రజలు అపోహలు నమ్మరాదని పత్రికలు కూడా వాస్తవాలు గ్రహించాలన్నారు. తలపై గాయాలైన మండవ రామకృష్ణ వినుకొండ ప్రవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడన్నారు. మైనరు బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన దాడికి పాల్పడిన నాసరమ్మ, బికారి, నాగుర్ మీరావలి, మీరాబాబు, నాగూర్, మైనరు బాలికలపై అందరిపై కేసులు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయనతో పాటు ఎస్సైలు చల్లా సురేష్, చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**గొడవులు, అల్లర్లుకు పాల్పడితే కఠిన చర్యలు**

సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో గొడవలు అల్లర్లుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కారుమంచి గ్రామంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టడంతో పాటు గ్రామంలో మరణాయుధాలు, నాటు బాంబులు ఉన్నాయేమో అని ముందస్తు సోదాలు పోలీసులు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సుధాకర్ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల మేరకు ఎన్నికల అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఉండటానికి ఈ సోదాలు చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం గ్రామప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఓటు వినియోగించుకోవటం ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కు అయితే రాజకీయ గొడవలు, అల్లర్లుకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు. కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో ఎస్సైలు చల్లా సురేష్, చెన్నకేశవులు, లక్ష్మి నారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలసి పనిచేస్తే పారిశుద్ధ్యం మెరుగుదల

**శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో కమిషనర్ సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

**నరసరావుపేట:** పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదల కోసం సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో పాటు ప్రతి ఒక్కరూ శ్రద్ధగా పనిచేస్తేనే మెరుగుదల కన్పిస్తుందని మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఓలేటి శ్రీనివాసరావుతో కలిసి పారిశుద్ధ్యం మెరుగుదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క సెక్రటరీ శ్రద్ధతో పనిచేయాలని వార్డులో ప్రతి ఒక్క పౌరుడికి బాధ్యతగా ఉండి వారు చెప్పిన సమస్యలపై వెంటనే స్పందించే విధంగా ఉండాలని కోరారు. ప్రతిరోజు వార్డు నందు విజిట్ చేసి ఎక్కడైతే కొంచెం సమస్య కన్పించినా అక్కడ సిబ్బందిని పెట్టి పనిచేయించాలన్నారు. కేటాయించిన వర్కర్ల ద్వారా వార్డులో వారిని పర్యవేక్షణ చేసుకొని కాలువలు, డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, స్ప్రేయింగ్, ఫాగింగ్ సంబంధించి ప్రతి ఒక్కరి వార్డులో జరిగే శానిటేషన్ మీదే బాధ్యతని తెలియజేశారు. కొంత మంది సెక్రటరీలు అలసత్వం వహించడం జరుగుతుందని, వారు తమ పద్ధతిని మార్చుకొని శ్రద్ధతో పనిచేయాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు కూడా వారి డివిజన్లకు సంబంధించి ఎక్కువ శానిటేషన్‌పై ఫిర్యాదులు రావడం జరుగుతుందో సదరు ప్రాంతాలను నోట్ చేసుకుని ఒకటికి రెండుసార్లు ఆ ప్రాంతాలను పర్యవేక్షణ చేసుకోవాలని సూచించారు. ఎవరైతే పనిచేయట్లేదో వారి పేర్లను నోట్ చేసుకొని తన వద్దకు తెచ్చినట్లయితే వారిపై శాఖపరమైన చర్యలకు సిఫార్సు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఆ విధంగా ప్రతి ఒక్కరూ కిందిస్థాయి వర్కర్ నుంచి పై స్థాయి అధికారి వరకు తమవంతు బాధ్యత సక్రమంగా నిర్వహిస్తే సమస్యలను త్వరగా పరిష్కారమౌతాయన్నారు. ఏ వార్డుకు సంబంధించి ప్రజల వద్ద నుంచి సంబంధిత శానిటరీ సెక్రైటరీ ఫోన్ లిఫ్ట్ చేయట్లేదని, సమస్యను పరిష్కరించట్లేదని గాని ఫిర్యాదు వస్తే సంబంధిత సెక్రైటరీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున సదరు విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించుకుని పనిచేయాలని కోరారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వరరావు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

# హనుమత్ వాహనంపై రంగనాథుడు ఊరేగింపు



రంగనాథుడు శ్రీ-భూదేవి అమ్మవార్లు



వివిధ రకాల పుష్పాలతో పూజలకు హాజరవుతున్న సువాసినులు

**యడ్లపాడు:** మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత రంగనాయక స్వామి దేవస్థానంలో కల్యాణ ఉత్సవాలు కన్నుల పండువల కొనసాగుతున్నాయి. మూడవరోజు మంగళవారం పండితుల ఆధ్వర్యంలో యాగ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో శ్రీదేవి భూదేవి అమ్మవార్లతో పాటు రంగనాథుడికి విశేష అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణానికి చెందిన వాసవీ భక్త మండలి ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారి పారాయణం, భజన కార్యక్రమం వహించారు. రాత్రి హోమార్చన అనంతరం రంగనాథ స్వామి వారిని హనుమత్ వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు అరవపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అరవపల్లి బ్రదర్స్, ఆలయ ఈవో పర్యవేక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

# రంగా కాలనీలో పోలీసుల తనిఖీలు



**సత్తెనపల్లి:** పట్టణంలోని రంగా కాలనీలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రంగా కాలనీలో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలింగ్ తర్వాత కూడా చెదురుమదురు ఘటనలు చోటు చేసుకోవడం, కౌంటింగ్ రోజున అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనల నేపథ్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.